
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఖమ్మం
KHAMMAM

శనివారం, 10 ఆగస్టు 2024

5

పాండురంగాపురం-మల్కాన్‌గిరి రైల్వే లైన్ మంజూరు

భద్రాచలం మీదుగా నిర్మాణం.. రూ.3592 కోట్ల నిధులు..

కొత్తగూడెం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాండురంగాపురం నుంచి ఒడిసాలోని మల్కాన్‌గిరి వరకు నూతన రైల్వే లైన్‌ను మంజూరు చేస్తూ కేంద్ర కేబినెట్ శుక్రవారం ఆమోదించింది. సుమారు 186 కిలోమీటర్ల ఈ రైల్వే లైన్‌కు రూ.3,592 కోట్లు నిధులు కేటాయించారు. ఈ రైల్వే లైన్ పాండురంగాపురం నుంచి భద్రాచలం మీదుగా మల్కాన్‌గిరి వరకు ఏర్పాటు చేయనున్నారు. దేశవ్యాప్తంగా 15 ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం తెలుపగా.. అందులో కొత్తగూడేనికి స్థానం కల్పించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వైరాలో అమృత్ 2.0 మంచినీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం

15న రుణవిముక్తులను చేస్తాం

- ఆ రోజు రైతులందరూ సంబరాలు చేసుకోవాలి
- సీఎం చేతుల మీదుగా సీతారామ ద్వారా గోదావరి జలాల విడుదల
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

6



వినోబానగర్ లింక్ కెనాల్‌వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

త్వరలో కొత్త రెవెన్యూ చట్టం

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం..
- తెల్లరేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు వేర్వేరుగా అందిస్తాం
- 15న రైతులకు రూ.2లక్షల రుణమాఫీ: మంత్రి పొంగులేటి

6



భద్రాచలంలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, పీవో తదితరులు

ఆదివాసీల సంస్కృతిని రక్షించుకోవాలి

- ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం
- మన్యం వీరులకు నివాళి... భద్రాచలంలో ఆదివాసీల భారీ ర్యాలీ

దోమల దండయాత్ర

డెంగ్యూ జ్వరాలు ప్రజలను వణికిస్తున్నాయి. పల్లెల్లో ఈ మహమ్మారి.. చాప కింద నీరులా విస్తరిస్తోంది. పల్లెలు, పట్టణాల్లో దోమలు దండయాత్ర చేస్తుండడంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. మారుమూల ప్రాంతాలతో పాటు గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం లోపించిన కారణంగా డెంగ్యూ కేసులు పెద్దసంఖ్యలో నమోదవుతున్నాయి. వర్షాలతో సీజనల్ వ్యాధులు సంక్రమించే ఆస్కారం ఉన్నప్పటికీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ.. ఇతర శాఖలతో సమన్వయం చేస్తున్నప్పటికీ డెంగ్యూ కేసులు పెరుగుతుండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది.



జ్వర పీడితులతో కిటకిటలాడుతున్న ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి

డెంగ్యూ కాటు

వర్షాల వేళ పల్లెల్లో పారిశుధ్య నిర్వహణ లోపం

- ప్రబలుతున్న విషజ్వరాలు
- పెరుగుతున్న డెంగ్యూ రోగులు
- ఇప్పటివరకు ఖమ్మం జిల్లాలో 306 కేసుల నమోదు
- ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ డెంగ్యూ పీడితులు
- హైరిస్క్ జోన్‌లో ఖమ్మం జిల్లా

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 9: డెంగ్యూ జ్వర పీడితులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. పెద్దసంఖ్యలో జనం డెంగ్యూ జ్వరాలతో అడ్మిట్ అవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా కనిపిస్తోంది. గత కొద్ది రోజులుగా పంచాయతీలకు జవాబుదారీ కలిగిన అధికారులు లేకపోవడంతో పారిశుధ్యం పడకేసింది. దీంతో పల్లెల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇదే విషయాన్ని ఇటీవల నిర్వహించిన జడ్పీ సమావేశంలోనూ సభ్యులు ముక్తకంఠంతో నినదించారు. మూడేళ్లక్రితం కల్లూరు మండలం అంబేద్కర్ నగర్‌లో జనం డెంగ్యూ జ్వరాల బారిన పడ్డారు. తాజాగా జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 306 కేసులు నమోదైనట్టు చెబుతున్నా అవి ఇంకా ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా జిల్లాలో పలు ప్రాంతాల్లో డెంగ్యూ కేసులు నమోదవుతుండడంతో అప్రమత్తం అవుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఎంవీ పాలెం, పెద్దగోపతి, నేలకొండపల్లి, వల్లభి, తిరుమలాయపాలెం, మంచుకొండ, చింతకాని పీహెచ్‌సీల పరిధిలో డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. జనవరి నుంచి ఇప్పటివరకు మొత్తం 12,621 రక్త నమూనాలు సేకరించగా, పాజిటివ్ కేసులు 306గా తేలాయి. ఇవి 18 పీహెచ్‌సీల పరిధిలో నమోదైనట్టుగా గుర్తించారు. ఇప్పటి వరకు 14 గ్రామాల్లో డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో అత్యధిక కేసులు నమోదైన జిల్లాల్లో హైదరాబాద్ తర్వాత ఖమ్మం జిల్లానే ఉండటంతో హైరిస్క్ జోన్‌గా గుర్తించారు.



ఇలాంటి ప్రాంతాలే దోమలు వ్యాప్తికి కారణం

లోపించిన పారిశుధ్యం

గత నెలరోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించి డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. మూడేళ్ల క్రితం ప్రాణనష్టం కూడా సంభవించింది. ఈ ఏడాది డెంగ్యూ మరణాలు లేవని చెపుతున్నా అక్కడక్కడా మరణాలు కూడా సంభవించాయి. గ్రామీణ ప్రాంతాల్లో వర్షాలు జూలై రెండో వారం నుంచి ఇప్పటివరకు అధికంగా వర్షాలు పడుతున్నాయి. పల్లెల్లో ప్రస్తుతం పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో ఇళ్లలో చెత్తా చెదారాన్ని తీసుకెళ్లేవారు కరువయ్యారు. దీంతోపాటు పరిసరాల పరిశుభ్రతపై డ్రైడే కార్యక్రమాల నిర్వహణలో చిత్తశుద్ధి లోపిస్తుండటంతో సమస్య పరిష్కారం కావడం లేదని ప్రజాప్రతినిధులు,

(మిగతా 6వ పేజీలో)

పాలేరు-పర్ణశాల టూరిజం హబ్

- మంత్రి జూపల్లికి మంత్రి తుమ్మల ప్రతిపాదనలు
- 12న ఉమ్మడి జిల్లాలో పర్యటనకు ఆహ్వానం

ఖమ్మం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి జిల్లాకు రాష్ట్రంలోనే పర్యాటకంగా గుర్తింపు తెచ్చేందుకు పాలేరు నుంచి పర్ణశాల వరకు టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ప్రతిపాదనలను మంత్రి జూపల్లికి తుమ్మల వివరించారు. ఈనెల 12న ఖమ్మం జిల్లా పర్యటనకు రావాలని, క్షేత్రస్థాయిలో పర్యాటక ప్రదేశాలను చూసి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి తుమ్మల కోరడంతో అందుకు జూపల్లి అంగీకరించారు.

హైదరాబాద్‌లో జరిగిన ఉమ్మడి సమావేశంలో నియోజకవర్గాల వారీగా పర్యాటక ప్రదేశాల గురించి తుమ్మల వివరించారు.పాలేరు రిజర్వాయర్ నేషనల్ హైవేకు సమీపంలో ఉన్నందున పర్యాటకంగా అభివృద్ధి చేయాలని, దేశంలోనే అతిపెద్ద శివలింగంగా ఉన్న కూసుమంచి శివాలయం, నేలకొండపల్లి బౌద్ధస్థూపం, భక్తరామదాసు ధ్యానమందిరాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఖమ్మం ఖిల్లాపై రోప్‌వే ఏర్పాటు, లకారం ట్యాంక్ బండ్‌పై పర్యాటక అభివృద్ధి, వెలుగుమట్ల అర్బన్ పార్కును ఖమ్మానికి మణిహారంగా అభివృద్ధి చేయాలన్నారు. వైరా రిజర్వాయర్, కిన్నెరసాని ప్రాజెక్టు, భద్రాచలం కరకట్ట వద్ద పర్యాటక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి జూపల్లిని కోరారు. భద్రాచలం రామాయణ థీమ్‌పార్కుకు ప్రతిపాదనలు చేయడం జరిగిందని, దీనికి కూడా నిధులు మంజూరు చేయాలని కోరారు. పాలేరు నుంచి పర్ణశాల వరకు టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసి పర్యాటకులు పెద్దఎత్తుగా వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భద్రాచలం రామాలయం, గోదావరి నది, కిన్నెరసాని అభయారణ్యం, సింగరేణి గనులు, కేటీపీఎస్, ఐటీసీ, హెవీవాటర్ ప్రాజెక్టు.... వినోదంతోపాటు విజ్ఞానం కూడా కలిగిస్తాయని, వీటిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని మంత్రి తుమ్మల కోరారు.

స్థలాల కేటాయింపు

- ఖమ్మం మెడికల్ కాలేజీకి 30 ఎకరాలు
- 'స్వామి నారాయణ'కు 13.5 ఎకరాలు
- జీవోలు జారీ చేసిన ప్రభుత్వం

రఘునాథపాలెం, ఆగస్టు 9: మంత్రి తుమ్మల చొరవ ఫలించింది. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ, స్వామి నారాయణ గురుకుల పాఠశాలల నిర్మాణానికి స్థలాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. మెడికల్ కాలేజీకి రఘునాథపాలెం సర్వే నెంబర్‌లో 15 ఎకరాలు, ఖమ్మం అర్బన్‌లో 15 ఎకరాలు మొత్తం 30 ఎకరాలను కేటాయించారు. ఈ మేరకు రెవెన్యూ, ల్యాండ్ పరిపాలన విభాగాల నుంచి జీవో ఎంఎస్ 72ను శుక్రవారం విడుదల చేశారు. దీంతో పాటు స్వామి నారాయణ గురుకుల ఇంటర్నేషనల్ పాఠశాలకు 13.5 ఎకరాలను కేటాయించారు. ఒక్కో ఎకరానికి ధర రూ.11.50 లక్షలుగా నిర్ధారించారు. ప్రభుత్వ ధర మేరకు స్థలం కేటాయించినందున స్వామినారాయణ పాఠశాలలో 10 శాతం సీట్లు కలెక్టర్ సిఫార్సు చేసిన విద్యార్థులకు ఉచితంగా దక్కనున్నాయి.



రేపు మంత్రి ఉత్తమ్ రాక

- 'సీతారామ' ట్రయల్‌రన్‌కు హాజరు

ఖమ్మం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈనెల 11న జిల్లా పర్యటనకు రాబోతున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద 'సీతారామ' పంపుహౌస్-2 ట్రయల్‌రన్ చేస్తారని, అదేరోజు ఉద యం 11-30 గంటలకు కమలాపురంలో పంపుహౌస్ ట్రయల్‌రన్‌కు హాజరవుతారని, వైరా లింక్ కెనాల్‌కు నీటిని విడుదల చేసి ఏరియల్ వ్యూ ద్వారా తిలకిస్తారని తెలిపారు. అలాగే వైరా బహిరంగ సభ స్థలాన్ని పరిశీలిస్తారని తుమ్మల తెలిపారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్లమంటూ...



రెస్టారెంట్లో నిందితులను నిర్బంధించిన దృశ్యం

- నగరంలోని కింగ్ దర్బార్ రెస్టారెంట్‌లో నలుగురి ముఠా హల్‌చల్
- ఉన్నతాధికారి సీసీ పేరు చెప్పి రూ.2 లక్షల డిమాండ్
- దుండగులను బంధించి ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించిన నిర్వాహకులు
- కేసు నమోదు చేసిన పోలీసులు.. నగరంలో సంచలనం...

ఖమ్మం సంక్షేమ విభాగం /ఖమ్మం క్రైం, ఆగస్టు 9: చెడు వ్యవసనాలకు అలవాటు పడిన నలుగురు యువకులు సులభంగా డబ్బు సంపాదించాలని ప్లాన్ వేశారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లుగా అవతారమెత్తారు. ఓ రెస్టారెంట్‌కు వెళ్లి జిల్లా ఉన్నతాధికారి సీసీ పేరు చెప్పి మరీ డబ్బులు డిమాండ్ చేశారు.. అయితే రెస్టారెంట్ నిర్వాహకుల అప్రమత్తతతో కథ అడ్డం తిరిగి నలుగురు నకిలీలు కటకటాల పాలయ్యారు. వివరాల్లోకి వెళ్లితే..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని సీతారాంపురం టేకులపల్లికి చెందిన గుగులోత్ మోహన్‌రావు, సపావత్ యువరాజు, అజ్మీరా యువరాజ్‌సింగ్, బానోత్ రామస్వామిలు ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ అధికారులమంటూ వ్యాపారులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇదే క్రమంలో గురువారం ఖమ్మం మమత రోడ్డులోని కింగ్‌దర్బార్ హోటల్‌కు వెళ్లి తాము ఇన్‌స్పెక్టర్లమంటూ తనిఖీలు చేస్తున్నట్టు హడావిడి చేశారు. ఆహార పదార్థాల క్వాలిటీ సరిగా లేదని కేసులు పెడతామని రూ.10వేలు డిమాండ్ చేశారు. దీంతో హోటల్ నిర్వాహకులు రూ.4500 ఫోన్‌పే ద్వారా ఇచ్చారు.

తిరిగి ఇదే ముఠా శుక్రవారం మధ్యాహ్నం మళ్లీ హోటల్‌కు వచ్చారు. కిచెన్, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేశారు. చికెన్, మటన్, రొయ్యలు, చేపల శ్యాంపిల్స్ సేకరించారు. మసాలాల తయారీ తేదీలను తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తామని బెదిరించారు. కేసులు పెట్టకుండా ఉండాలంటే రూ.2లక్షలు ఇవ్వాలని, ఇందులో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు రూ.లక్ష, జిల్లా ఉన్నతాధికారి సీసీకి రూ.50వేలు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన హోటల్ నిర్వాహకులు మీరు ఇక్కడే ఉండండి డబ్బులు తెస్తామని చెప్పి జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే ఆయన హోటల్‌కు చేరుకున్నారు. నలుగురు వ్యక్తుల్ని చూసి వారికి ఆహార తనిఖీ శాఖతో ఎటువంటి సంబంధం లేదని తేల్చారు. దీంతో నిందితుల్ని ఖానాపురం హవేలి పోలీసుస్టేషన్‌కు తరలించగా, సీఐ భానుప్రకాష్ విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఎఫ్ఆర్‌వో 'చల్లమల్ల' కుటుంబానికి అండ

ఖమ్మంలో 500 గజాల ఇంటి స్థలం కేటాయిస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కొత్తగూడెం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం గొత్తికోయల చేతిలో హత్యకు గురైన చంద్రుగొండ మండల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చల్లమల్ల శ్రీనివాసరావు కుటుంబసభ్యులకు త్వరలో 500 గజాల ఇంటిస్థలం పట్టాను అందజేస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ ఫారెస్ట్ బీట్ పరిధిలోని రేగళ్ల ప్రాంతంలో శుక్రవారం ఆయన వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీనివాసరావు కుటుంబానికి గత ప్రభుత్వం ఖమ్మం పట్టణంలో 500గజాల ఇంటిస్థలం పట్టా ఇచ్చినట్లే ఇచ్చి మళ్లీ తీసుకున్నారని తెలిపారు. ఖమ్మంలో గతంలో ఇచ్చిన 500గజాల ఇంటి స్థలం పట్టాను శ్రీనివాస్ కుటుంబసభ్యులకు త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు.

పట్టించుకోండి..

బీసీ గురుకులం.. సమస్యలు ఘనం



లంకపల్లి గురుకులంలో నామమాత్రంగా ఉన్న మూత్రశాలలు

- సదుపాయాల లేమితో విద్యార్థుల అష్టకష్టాలు
- అద్దె భవనాల్లోనే ఎంజేపీ విద్యాసంస్థల నిర్వహణ
- ఒకే ప్రాంగణంలో ఐదు, ఆరు పాఠశాలకు ఆశ్రయం
- ధ్వంసమైన మరుగుదొడ్లు
- తల్లిదండ్రులకు వేచిఉండే సదుపాయం లేనే లేదు
- సెలవు రోజుల్లో కిక్కిరిసిపోతున్న ప్రాంగణాలు
- సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యంగా అధికారులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాల పరిధిలోని మహాత్మజ్యోతిబా పూలే గురుకులాల్లో సౌకర్యాలు లేమితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అద్దె భవనాల్లో శిథిలావస్థకు చేరిన తరగతి గదులు, నాణ్యతలేని ఆహారం, బిల్లులు సమయానికి రాక మెనూ పాటించని నిర్వాహకులు, తలుపులు లేని మరుగుదొడ్లు, కాలకృత్యాలకు కరువైన నీటి వసతులతో విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. గత ఏడాది వరకు ఎక్కుగా కాంట్రాక్ట్ పద్ధతిలో ఉపాధ్యాయులకు తీసుకున్న ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ఆ పద్ధతికి స్వస్తి చెప్పి రెగ్యూలర్ ఉపాధ్యాయులను నియమించింది. అయినప్పటికి నిర్వాహణలో మాత్రం నిర్లక్ష్యం కనిపిస్తూనే ఉంది.

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 9: గతంలో లంకపల్లి, చెరువుమాధారం, వైరా గురుకులాల్లో నాణ్యతలేని బోజనం అందిస్తుండటంతో విద్యార్థులు, వారి తల్లితండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి ప్రధాన రహదారులపై నిరసన వ్యక్తం చేసినా పరిస్థితిలో మార్పు రాలేదు. ప్రతీరోజు విద్యార్థులకు పండ్లు, గుడ్ల తోపాటు ప్రతీ ఆదివారం చికెన్, మటన్ వడ్డించాలి. ఉదయం రాగి జావతోపాటు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాల్సి ఉంది. కానీ అలాంటివేవీ పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. అరటిపండ్లు నాణ్యత లేకుండా కుళ్లిపోయిన పరిస్థితిలో ఉన్న వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాఠశాలలు, కళాశాలల్లో ఆడిందే ఆట, పాడిందే పాటగా తయారైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో పాఠశాలలు 24, కళాశాలలు 22 ఉన్నాయి. ఇందులో ఖమ్మం జిల్లాలో పాఠశాలలు13, కళాశాలలు12, భద్రాద్రి కొత్తగుడెం జిల్లాలో పాఠశాలలు 11, కళాశాలలు 10, డిగ్రీ కళాశాల ఖమ్మంలో మహిళా, భద్రాద్రి కొత్తగుడెంలో పురుషుల కళాశాలలు ఉండగా సొంత భవనాలు కేవలం రెండే ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం పాఠశాల విద్యార్థులు 11,360మంది కాగా వారిలో కళాశాల విద్యార్థులు 3,840మంది, డిగ్రీ విద్యార్థులు 800మంది ఉన్నారు.

అద్దె భవనాల్లో సౌకర్యాల లేమి..

ప్రభుత్వం గురుకుల కళాశాలలు, పాఠశాలల ను హడావిడిగా ఏర్పాటు చేసిందన్న విమర్శలున్నాయి. ముందుగా భవన నిర్మాణాలు పూర్తిచేసి కళాశాల ఏర్పాటు చేయాలి. కానీ నూతన భవనాలు నిర్మించాలన్న ఆలోచన చేయకపోవడం గమనార్హం. గురుకుల పాఠశాలలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. గురుకులాలకు ప్రహరీలేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కొన్ని గురుకులాల చుట్టూ పొలాలు ఉండడంతో తరచుగా పాములు కూడా పాఠశాలల గదుల్లోకి వస్తున్నట్లు తెలుస్తోంది. చెరువుమాధారం గురుకుల బాలికల పాఠశాలలో 480 మంది విద్యార్థులకు అంతంత మాత్రంగానే టాయిలెట్లు ఉన్నాయి. గేటు సౌకర్యం కూడా లేకపోవటంతో పాఠశాల ప్రిన్సిపాల్ సొంత ఖర్చులతో గేటును ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాల్లో ఎక్కువ గురుకులాల్లో మరుగుదొడ్ల డోర్లు పూర్తిగా ధ్వంసమై విద్యార్థినులు రాత్రి, ఉదయం వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఒక్కోప్రాంగణంలో ఐదారు గురుకులాలు..

ఒక ప్రాంగణంలో ఒక గురుకుల పాఠశాల ఉంటేనే సుమారు 500 వందల మంది విద్యార్థులతో ప్రాంగణం అంతా కోలాహలంగా ఉంటుంది. వారికి సౌకర్యాలు సరిపడా ఏర్పాటు చేయవచ్చు. కాని ఖమ్మం జిల్లాలో ఒకే ప్రాంగణంలో మధిర దగ్గర ఆరు బీసీ గురుకులాల నిర్వహిస్తున్నారు. ఖమ్మం రఘునాధపాలెం వద్ద గల ఒక ప్రాంగణంలో నాలుగు బీసీ, ఒక మైనారిటీ గురుకులాలు నిర్వహిస్తున్నారు. ఇందులోనే బీసీ డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతాలు ఎప్పుడు చూసినా విద్యార్థుల తల్లితండ్రులతో సందడిగా ఉంటుంది. నెలకోసారి విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థులతో కలిసి ఉండేందుకు అవకాశం కల్పించినప్పుడు కనీసం కూర్చునే సదుపాయం కూడా లేకుండాపోతోంది. ఎండలోనే చిన్నారులతో ముచ్చటిస్తూ అన్నాలు తినిపిస్తున్నారు. ఆ సమయంలో వర్షం వస్తే పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించినా ఎవరూ పట్టించుకోవడం లేదు.



చెరువుమాధారం గురుకులంలో తల్లిదండ్రులు విద్యార్థులతో కలిసి ఎండలో చెట్ల కిందే భోజనాలు చేస్తున్న దృశ్యం

భౌ..బోయ్



- కుక్కకాట్లు.. ప్రజల పాట్లు
- ఏడు నెలల్లో 2,988 మంది బాధితులు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 9: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్ నంబర్ ఏడేళ్ల బాలుడు స్నేహితులతో గలిసి స్కూల్ నుంచి ఇంటికి తిరగి వస్తుండగా కాలనీలో తిరుగుతున్న సమయంలో కుక్క దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. సారధినగర్‌లో చెందిన ఎనిమిదేళ్ల బాలుడిపై కుక్కలు దాడిచేయడంతో రెండు రోజులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాడు.. ఇలా జిల్లాలో శునకాలతో ఆసుపత్రుల పాలైన వారి సంఖ్య భారీగానే ఉంటోంది. జిల్లా కేంద్రంతో పాటు.. గ్రామీణ ప్రాంతాల్లోనూ శునకాల సంఖ్య పెరిగింది. కుక్కలు దాడి చేయగానే బాధితులు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు2,988 మంది కుక్క కాటుకు బలై దవాఖానాల్లో యాంటీరేబిస్ టీకా తీసుకున్నారు. అయితే జిల్లా కేంద్రంలో 10 రోజుల్లో 34 మంది కుక్కకాటుతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చారు. కొత్తవారు 43 మంది. ఉండగా.. 236 మంది రెండు, మూడో డోసులు వేసుకున్నారు.

జనవరి నుంచి జూలై వరకు కుక్క కాటు బాధితులు

నెల	బాధితులు	ఐపీ రోగులు
జనవరి	482	5
ఫిబ్రవరి	410	7
మార్చి	391	4
ఏప్రిల్	412	8
మే	426	5
జూన్	429	6
జూలై	438	8
మొత్తం	2,988	43

మొక్కుబడి చర్యలు..

గ్రామాల్లో, నగరాల్లో ప్రతి వీధిలో, గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మనుషులపై దాడి చేస్తుంటే నగరపాలక, పురపాలక, గ్రామస్థాయి అధికారులు మొక్కుబడి చర్యలు మాత్రమే చేపడుతున్నారు. శునకాలకు సంతానం కలగకుండా శస్త్రచికిత్సలు చేసి అక్కడే వదిలేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. రోజుకి పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నా స్పందించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. కుక్క కరిచినా చోట వస్త్రం కడితే రేబిస్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంది.

48 గంటల్లోపు టీకా వేసుకోవాలి

డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్, ఖమ్మం

కుక్కకకాటు బారిన పడిన వారికి ఖరీదైన ఎమినోగ్లోబిన్ టీకా ఇస్తున్నాం. కుక్కలు కరిచిన చోట శుభ్రంగా కడగాలి. ఎలాంటి స్పిరిట్ రాయకూడదు. 48 గంటల్లోగా టీకా తీసుకోవాలి.



ఆదివాసీ ర్యాలీలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

చదువుతోనే భవిష్యత్తు

- ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 9: ప్రజల భవిష్యత్తు తీర్చిదిద్దేది చదువేని, ప్రతి ఒక్కరు చదువుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని పెవిలియన్ నుంచి జడ్పీ సెంటర్ వరకు చేపట్టిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలో ఉన్నత స్థితికి ఎదగాలంటే చదువు ఒకటే మూలమని అన్నారు. చదువు ద్వారా ఎంతటి స్థాయినైన చేరుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఆదివాసీ సాంప్రదాయాల ద్వారా నేర్చుకోవాల్సింది చాలా ఉందన్నారు. ఆర్థికంగా కాకుండా, ఆరోగ్యపరంగా, ప్రకృతిలో మమేకమై సంతోషకరమైన జీవనం గడపడం ఆదివాసీల నుండి నేర్చుకోవాలన్నారు. ఆదివాసీలు మారుమూల ప్రాంతాల్లో వెనుకబడి ఉన్నారని, విద్యాపరంగా, ఆరోగ్య పరంగా, మౌళిక వసతుల పరంగా సమస్యలు ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం నుంచి, జిల్లా యంత్రాంగం తరఫున సేవలు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మీ గిరిజన భవనంలో ఆదివాసీల జెండాను ఆవిష్కరించారు. కొమురం భీం, ఆదివాసీ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గిరిజన భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఏవో నారాయణ రెడ్డి, ఏటీడీవోలు, ఏసీఎంవోలు పాల్గొన్నారు.

15న రుణవిముక్తులను చేస్తాం

- ఆ రోజు రైతులందరూ సంబరాలు చేసుకోవాలి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

వైరా, ఆగస్టు 9: వైరాలో ఈ నెల 15న నిర్వహించే రైతు బహిరంగ సభ నుంచి రాష్ట్రంలోని రైతులను రుణ విముక్తులం చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఖమ్మంజిల్లా వైరా మండలంలో శుక్రవారం విస్తృతంగా పర్యటించి రూ.122కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం తమ స్వగ్రామమైన స్నానాలలక్ష్మీపురం గ్రామంలోని వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య ఇంటివద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు.

వైరాలో నిర్వహించే రైతు బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాను, మంత్రివర్గ సహచరులు, అన్నిజిల్లాల ఎమ్మెల్యేలు పాల్గొంటామని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను సీఎం రేవంత్‌రెడ్డి జాతికి అంకితం చేస్తారని తెలిపారు. ఆ తర్వాత వైరాలో నిర్వహించే రైతు బహిరంగ సభలో రూ.రెండు లక్షల రుణమాఫీతో రాష్ట్రంలోని రైతులను రుణ విముక్తులం చేస్తామని తెలిపారు. ఆగస్టు 15 రైతులకు ఒక పండుగ అని అందరూ సంబరాలు చేసుకోవాలని సూచించారు.

ఇప్పటివరకు రెండు విడతల్లో రూ.1.50లక్షల్లోపు రుణమాఫీని 16.29 లక్షల కుటుంబాలకు అందించామని తెలిపారు. 17.01లక్షల రైతుల ఖాతాల్లో రూ.12,289 కోట్ల రుణమాఫీ నిధులను జమ చేశామని తెలిపారు. రూ.2లక్షల రుణమాఫీకి నిబద్ధతతో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఎంపీ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలు ఆశ్చర్యపోయే విధంగా ఆగస్టు 15నాటికి రుణమాఫీ చేస్తామని చాలెంజ్ చేశారని, దాన్ని తాను డిప్యూటీ సీఎంగా నిబద్ధతతో ఆర్థికమంత్రి హోదాలో అమలు చేస్తున్నానని పేర్కొన్నారు. రుణమాఫీతోపాటు ఎప్పుడూ లేని విధంగా వ్యవసాయ, వ్యవసాయేతర అనుబంధ రంగాలకు బడ్జెట్లో రూ.72వేల కోట్లు తొలిసారి కేటాయించామని తెలిపారు. రైతు బీమా కింద రూ.1,540కోట్లను, పంటల బీమా కింద రూ.1,350 కోట్లను ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు.

రాష్ట్రంలో నీటిపారుదల రంగాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని విమర్శించారు. కేవలం రూ.1,450 కోట్లతో పూర్తయ్యే రాజీవ్, ఇందిరాసాగర్‌లను రీడిజైన్ పేరుతో సీతారామ ప్రాజెక్టుగా మార్చి రూ.23 వేల కోట్లకు అంచనాలు పెంచారని విమర్శించారు. రూ.8వేల కోట్ల నిధులను ఖర్చుచేసినా ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వలేకపోయారని తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం రూ.75 కోట్లతో రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా 1.50లక్షల ఎకరాలకు సాగునీరు అందించబోతున్నామని తెలిపారు. ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గోదావరి జలాలను విడుదల చేస్తామని తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ కార్యదర్శి నూతి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదివాసీల సంస్కృతిని పరిరక్షించుకోవాలి

- భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు
- మన్యం వీరులకు ఘన నివాళులు

భద్రాచలం, ఆగస్టు 9: ఆదివాసీల భాష, సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ద్వారా ఆదివాసీ తెగ అంతరించిపోకుండా కాపాడుకున్నవారమవుతామని అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏజెన్సీ డివిజన్ కేంద్రమైన భద్రాచలంలో శుక్రవారం గిరిజన భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మన్యంవీరులైన అల్లూరి సీతారామరాజు, గంటందొర, మల్లుదొర తదితరులు ఆదివాసీల కోసం ఎంతగానో కృషి చేశారని అన్నారు. ఆదివాసీలు తక్కువ మంది మాత్రమే భాష మాట్లాడుతున్నారని దీని వలన భాష అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బాల్యం నుంచే పిల్లలకు భాష, సంస్కృతి, సంప్రదాయాల ప్రాముఖ్యతను తల్లిదండ్రులు నేర్పించాలని సూచించారు. గిరిజన సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కొండరెడ్ల సంక్షేమానికి పాటుపడతామని అన్నారు.

జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్ మాట్లాడుతూ గిరిజనులకే సేవ చేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. స్వాతంత్ర్యం రాక ముందు బ్రిటీషు వారు అటవీ సంపదను కొల్లగొడుతుంటే ఆదివాసీ మహనీయులే వారిని అడ్డుకున్నారని గుర్తు చేశారు. గిరిజనుల సంక్షేమానికి తనవంతు కృషి తప్పకుండా చేస్తానని గిరిజన రైతులు నిరుద్యోగ యువతీ యువకులు ఏ సహాయం కోరినా తప్పకుండా చేస్తానని కలెక్టరు పేర్కొన్నారు. గిరిజనులు చేపల చెరువులు, పండ్ల తోటల ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ఐఏఎస్, ఐపీఎస్‌తో సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ మాట్లాడుతూ స్వచ్ఛమైన మనస్సు ఆదివాసీ గిరిజనులకు సొంతమన్నారు. వారికి సేవ చేసే భాగ్యం దక్కడం అదృష్టమన్నారు. యువత తమ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెడుతూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. బాల్య వివాహాలు ఏజెన్సీలో ఎక్కువగా ఉంటాయని ఈ క్రమంలో కౌన్సిలింగ్ ద్వారా వారికి అవగాహన కల్పించాలన్నారు. గిరిజన యువకులకు చెడు స్నేహాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గిరిజన యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి దుమ్ముగూడెం మండలంలో రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియంను నిర్మిస్తున్నామని దానిని యువకులు ఉపయోగించుకోవాలని అన్నారు.

ఐటీడీఏ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ఐటీడీఏ ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. భాష పరిరక్షణతో పాటు విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆశ్రమ గురుకులాల్లో అన్ని రకాల మౌళిక వసతులు కల్పించామని ముఖ్యంగా గిరిజన బాలికల పాఠశాలల్లో ప్రహరీ గోడలు, ఇతరత్రా మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. నిరుద్యోగ యువతకు వృత్తి శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. గిరిజన గ్రామాల్లో చిన్నారులకు పోషకాహారపరంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని త్వరలో భద్రాచలంలో గిరిజనులు సేకరించే అటవీఫలాలు, ఇప్పపూల సేకరణకు సంబంధించిన నూనె తయారు చేసే యంత్రాన్ని నెలకొల్పుతామని పీవో తెలిపారు. గిరిజనులకు ఏ సమస్య వచ్చినా నేరుగా తననే సంప్రదించవచ్చునని సూచించారు.



భద్రాచలంలో ఆదివాసీల ర్యాలీ



ఆదివాసీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

మన్యం వీరులకు నివాళ్లర్పించిన ఎమ్మెల్యే, పీవోలు

అంతకు ముందు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మన్యంవీరులైన అల్లూరి సీతారామరాజు గంటందొర, మల్లుదొరలతో పాటు కొమరం భీమ్, రాణి దుర్గాదేవిలతో పాటు భారత రాజ్యాంగ నిర్మాత అంబేధ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఇతర అధికారులు, ఆదివాసీ సంఘాల నాయకులుఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ పతకాన్ని ఆదివాసీ సీనియర్ నాయకులు చిచ్చడి శ్రీరామమూర్తి ఎగురవేశారు. ఈ క్రమంలో అంబేద్కర్ సెంటర్, పొట్టి శ్రీరాములు సెంటరు మార్కెట్ సెంటరు, ఐటీడీఏ రోడ్డు మీదుగా గిరిజన భవనానికి చేరుకున్నారు. గత కొన్ని దశాబ్దాలుగా విద్య, వ్యవసాయం, క్రీడలు, కళాకారులు తదితర వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన ఆదివాసీ ప్రముఖులను గుర్తించి వారిని ఎమ్మెల్యే వెంకట్రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో బి.రాహుల్‌లు ఘనంగా సన్మానించారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

పాల్వంచ టౌన్, ఆగస్టు 9: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు బస్టాండ్ సెంటరులోని కొమరం భీం విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి. వెంకటేశ్వర్లు, కే. రంజిత్, ఎం. లక్ష్మణ్, హతీరామ్, ఎం. మురళీ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో..

బస్టాండ్ సెంటరులోని పార్టీ కార్యలయంలోమాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు ఆధ్వర్యంలో ఆదివాసి దినోత్సవం ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి. సంజీవరావు, నీలం భాస్కర్, టి. నాగరాజు, తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం జిల్లా అధ్యక్షులు ఎండి. మంజూర్, ప్రజాసంఘాల నాయకులు ఎన్. నాగరాజు, కృష్ణ, వెంకటయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



కొమరం భీ విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పొనిశెట్టి

రాష్ట్రంలో త్వరలో కొత్త రెవెన్యూ చట్టం

- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఏన్కూరు, ఆగస్టు 9: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో త్వరలో కొత్త రెవెన్యూ చట్టం తీసుకురావడానికి శ్రీకారం చుట్టినట్టు రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఏన్కూరులో సీతారామ లింక్ కెనాల్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ నూతన చట్టంతో ధరణి ఇబ్బందులు శాశ్వతంగా పరిష్కారవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాలను, సొమ్మును దుర్వినియోగం కాకుండా కాపాడేందుకు కాపలా ఉంటామన్నారు. ఆనాడు స్వర్గీయ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసిన రాజీవ్, ఇందిరసాగర్ ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం రీడిజైన్‌ల పేరుతో ప్రభుత్వసొమ్మును దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. రూ.2400కోట్లతో పూర్తికావాల్సిన ప్రాజెక్టులను సీతారామ పేరుతో రూ.18వేల కోట్లకు పెంచి ప్రజాధనాన్ని కేసీఆర్ ప్రభుత్వం లూటీ చేసిందని విమర్శించారు. ప్రాజెక్టుకు ఎక్కడ పడితే అక్కడ తలా తోక లేకుండా పనులు ప్రారంభించి రూ.8వేల కోట్లు గత ప్రభుత్వం ఖర్చు చేసిందని దుయ్యబట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల సర్వనాశనం అయిన పాలమూరు, కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టుల పనులను క్షుణ్ణంగా పునఃపరిశీలన చేసి రైతులకు ఉపయోగపడే విధంగా ఉపయోగంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. సీతారామ ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా లక్షా 35 వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుందన్నారు. వైరా, లంకాసాగర్‌తో పాటు 15 మండలాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. ప్రభుత్వం ఆగస్టు 15 నాటికి రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే అర్హులైన వారందరికి పక్కా గృహాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మొదటి విడతగా రూ.22,500 కోట్లతో నాలుగు లక్షల 50 వేల ఇళ్లను, నియోజకవర్గానికి 3500 చొప్పున ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

గత ప్రభుత్వం అసంపూర్తిగా ఉంచిన డబుల్‌బెడ్ రూం ఇళ్లను పూర్తిచేసి అర్హులైన లబ్ధిదారులకు అందిస్తామన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క తెల్లరేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్లరేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు వేర్వేరుగా ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, ఆర్డీవో రాజేంద్రగౌడ్, ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు వేముల కృష్ణప్రసాద్, లాలూనాయక్, మేడా ధర్మారావు, చందమామ నరసింహారావు, పూర్ణకంటి మైసారావు, పటాన్ మజీద్‌ఖాన్, గాలిబ్ సాహెబ్, మాదినేని అశోక్, కట్ట సత్యనారాయణ పాల్గొన్నారు.

లింక్ కెనాల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

జూలూరుపాడు: సీతారామ లింక్ కెనాల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జూలూరుపాడు మండలంలోని వినోభానగర్ గ్రామం వద్ద సీతారామ లింక్ కెనాల్ నిర్మాణ పనులను ఆకస్మికంగా పరిశీలించారు. ప్రధాన కాలువ వద్ద నుంచి ఆయన ట్రాక్టర్‌పై కిలో మీటర్‌న్నర వరకు ప్రయాణించి లింక్ కెనాల్ పనులను పరిశీలించారు. వినోభానగర్ నుంచి ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలోని హిమామ్‌నగర్ వరకు వెళ్లి పనులు ఎంతమేర పూర్తిఅయ్యాయో పరిశీలించారు. 15వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి లింక్ కెనాల్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో పనుల పురోగతిని తెలుసుకునేందుకు పరిశీలించారు. ఆయన వెంట రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ అర్జున్, డీఈ చంద్రశేఖర్, ఏఈ సాగర్, కాంగ్రెస్ వైరా నియోజకవర్గ నాయకులు ధారావత్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ కాటు

(5వ పేజీ తరువాయి)

ప్రజలు ఆరోపిస్తున్నారు. చాలా గ్రామాల్లో కాలనీల్లో వినియోగించిన కొబ్బరిబొండాలు, డ్రెయిన్లలో మురుగునీరు నిల్వ ఉండడం లాంటి కారణాలతో దోమల వ్యాప్తి పెరుగుతున్నట్లు సమాచారం. దీంతో ప్రజలు దోమకాటుకు గురై డెంగ్యూ జ్వరాల బారిన పడుతున్నట్లు సమాచారం. జిల్లాలోని వివిధ ప్రైవేటు ఆస్పత్రిల్లోనూ జ్వరపీడితులు అదీ డెంగ్యూ జ్వరాల బారిన పడిన వారు అధికంగానే నమోదవుతున్నట్టు పలువురు ప్రైవేటు వైద్యులు చెబుతున్నారు.

క్షేత్రస్థాయి పర్యటనలేవీ...?

జిల్లాలో డెంగ్యూ పట్ల ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు వైద్య, ఆరోగ్యశాఖను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అవి మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారు. ఎక్కడైతే జ్వరాలు, డెంగ్యూ బారిన పడతారో తక్షణమే ఆ ప్రాంతంలో రక్తనమూనాల సేకరణ, ఫాగింగ్, స్ప్రే చేయాల్సి ఉంది. పంచాయతీలు, పట్టణాల్లో ఫాగింగ్, నీటి నిల్వలేకుండా చేయాలి. డెంగ్యూకు కారణమయ్యే దోమ 100 మీటర్ల కంటే ఎక్కువగా ఎగుర లేదని ప్రతీ 50 ఇళ్లకు ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టి ఎక్కడా నీళ్లు నిల్వకుండా డ్రైడేను నిర్వహించాల్సి ఉంటుంది. అంతేకాదు గతంలో అధికంగా కేసులు నమోదైన ప్రాంతాలను, గ్రామాలను గుర్తించి అక్కడ కూడా ప్రత్యేక దృష్టిసారించాలి. గ్రామాల్లో పట్టణాల్లో పాత ఇనుము దుకాణాలు, టైర్లు, పంక్చర్లు వేసే దుకాణాలు, కొబ్బరి బొండాలు, చెత్తా చెదారం నిల్వ ఉండకుండా డ్రైడే కార్యక్రమంలో శుభ్రం చేసేలా వైద్య, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంది. కానీ ఎక్కడా అవి మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

- ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ
- కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
- అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్రమైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

- ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య


తేజస్విని (ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్వినిని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగర పాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేది ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాధిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.


అనిరుధ్ (ఫైల్)

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

పూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

- వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం
- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- 14లోగా ప్రతిపాదనలు అందించాలి
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతో పాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


ప్రాజెక్టుల్లో పూడికతీతపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా... ఈ ప్రాజెక్టు 1967 నాటికి 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

నిర్మల్ వాసి ఆడు జీవితం

- సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్
- రక్షించాలంటూ సెల్ఫీ వీడియో
- టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన
- నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దులోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్టు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్టు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

జడ్పీ చైర్మన్ పదవి సంతృప్తిని ఇచ్చింది: కమల్‌రాజ్

మధిరటౌన్, ఆగస్టు 9: జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఐదేళ్ల పదవీ కాలం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని జడ్పీ తాజా, మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. శుక్రవారం మధిరలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ గా పదవీ విరమణ చేసిన కమల్‌రాజు తో పాటు ఆ పార్టీకి చెందిన తాజా మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలను బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతు కేసీఆర్ నాయకత్వంలో పని చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని తన పదవీ కాలంలో పల్లెలు సమగ్ర అభివృద్ధి చెందాయని అన్నారు. ప్రతి పల్లెలో పల్లె ప్రకృతి వనం, ప్రతి పంచాయతీకి ట్రాక్టర్, శ్మశానవాటిక, సిమెంట్ రోడ్లు ఇలా అన్ని రంగాల్లో గతానికి, నేటికి స్పష్టమైన మార్పు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో కనిపించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు చిత్తారు నాగేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు బీఆర్‌ఎస్ రూరల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి శ్రీను, కనుమూరి వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, అరిగె శ్రీను, సొసైటీ అధ్యక్షులు బిక్కి కృష్ణప్రసాద్, సోషల్ మీడియ ఇన్‌చార్జ్ తాళ్లూరి హరీష్, యూత్ అధ్యక్షులు కూన నరేందర్ రెడ్డి, అబ్బూరి రామన్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వై. వి. అప్పారావు నాయకులు ప్యారి, ఇందిర కౌన్సిలర్లు సయ్యద్ ఇక్బాల్, బిక్కి అనిత, కోఆప్షన్ మెంబర్ కొఠారి రాఘవ తదితరులు పాల్గొన్నారు.


కమల్‌రాజ్‌ను సత్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కోయభాష లిపి ముద్రణ కోసం కృషి: కూనంనేని

పాల్వంచ రూరల్, ఆగస్టు 9: పాల్వంచ మండలంలోని కిన్నెరసానిలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నూతనంగా ఏర్పాటుచేసిన కొమరం భీం విగ్రహాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీ సమాజం మూలాలను భవిష్యత్‌తరాలకు చూపించాలని ఆయన అన్నారు. కొమరం బీం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కోయభాష లిపి ముద్రణ కోసం అసెంబ్లీలో చర్చిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పా షా, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎడవల్లి కృష్ణ, సీపీఐ జిల్లా నాయకులు ముత్యాల విశ్వనాథం, మండల, పట్టణ కార్యదర్శులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సాయిబాబా,ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


కొమ్ముబేషధారణలో ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి రిటైర్డ్ కార్మికులకు ఉచిత వైద్యం

- సర్క్యులర్ జారీ చేసిన యాజమాన్యం

ఇల్లెందు టౌన్, ఆగస్టు 9: సింగరేణిలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన మాజీ కార్మికులకు సీపీఆర్‌ఎం ఎస్ కార్డుతో సంబంధం లేకుండ ఈ వ్యాధులకైన ఉచితంగా వైద్య సదుపాయాలు కల్పించేందుకు సింగరేణి యాజమాన్యం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కోలిండియాలో జరిగిన అగ్రిమెంట్ ప్రకారం సింగరేణిలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన మాజీ కార్మికులకు క్రిటికల్ వ్యాధులైన గుండె, పక్షపాతం, కిడ్నీ సంబంధ, కేన్సర్, ఎయిడ్స్, నరాలు వ్యాధి తదితర వ్యాధులకు ఎంత ఖర్చు అయిన భరించే పద్ధతిలో అన్‌లిమిటెడ్‌గా వైద్య సౌకర్యాలు పొందేందుకు అవకాశాలు కల్పిస్తూ ఉత్తర్వులను విడుదల చేసింది. గతంలో సీపీఆర్‌ఎంఎస్ మెడికల్ కార్డు కింద అతి తక్కువ వ్యాధులకు మాత్రమే వైద్య సదుపాయం కల్పించగా ఇప్పుడు అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు పొందేవిధంగా సింగరేణి యాజమాన్యం అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని సింగరేణి డైరెక్టర్ (పా) పేరుతో సర్క్యులర్లు విడుదల చేయడం చేయడం గమనార్హం.

మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

చుంచుపల్లి, ఆగస్టు 9: రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కొత్తగూడేనికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. శుక్రవారం విద్యానగర్ కాలనీలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మున్సిపల్ కౌన్సిలర్ మోరే రూప, కో ఆప్షన్ సభ్యురాలు సరస్వతి, కనుకుంట్ల శ్రీనివాస్, వాసు, మోహనాచారి, ఈశ్వర్, మున్నారాము, సంధ్య, గాయత్రి, సంగీత్, ఆదిలక్ష్మీ, త్రిమూర్తులు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి పాల్గొన్నారు.


మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

ముచ్చా శ్రీనివాసరావుకు మాతృవియోగం

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 9: ఫెమా (ఫెడరేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) రాష్ట్ర కన్వీనర్ ప్రముఖ సాహితీవేత్త, విద్యావేత్త, జాషువా సాహిత్య వేదిక అధ్యక్షుడు ముచ్చా శ్రీనివాసరావు మాతృమూర్తి ముచ్చా పద్మావతి(85) శుక్రవారం ఖమ్మంలో మృతిచెందారు. మృతదేహాన్ని తెలుగు రాష్ట్రాలలోని పాఠశాలలు, కళాశాలల, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలు, వివిధ సాహిత్య సంఘాల ప్రతినిధులు, ఆత్మీయులు ఆమె మృతి పట్ల సంతాపాన్ని తెలిపి నివాళ్ళులు అర్పించారు. అంత్యక్రియలు సత్తుపల్లి మండలం లంకపల్లిలో నిర్వహించారు. ముచ్చా పద్మావతి, రంగయ్య ఫౌండేషన్ పేరుతో ప్రతి సంవత్సరం ప్రముఖ సాహితీవేత్తలకు, జూనియర్ సాహితీవేత్తలకు, విద్యావేత్తలకు పురస్కారాలను అందిస్తున్నారు.


పద్మావతి (ఫైల్)

శిశు విక్రయంపై కేసు నమోదు

- తల్లిదండ్రులతోపాటు కొన్న వ్యక్తికి రిమాండ్

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 9: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ఇటీవల వెలుగు చూసిన ఆడ శిశువు విక్రయం ఘటనపై పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. బిడ్డను అమ్మిన తల్లిదండ్రులతోపాటు కొన్న వ్యక్తిపై కేసును నమోదు చేశామని ఏటూరునాగారం ఎస్ఐ తాజొద్దీన్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కలివేరు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి ప్రసవం కోసం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి భర్త జంపయ్యతో కలిసి జూన్ 5న వచ్చింది. సాధారణ ప్రసవంతో ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటికే ఈ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉండగా మూడో కాన్పులోనూ మళ్లీ అమ్మాయే పుట్టడంతో వారు ఆ శిశువును విక్రయించారు. జూన్7న ఆస్పత్రి నుంచి బయటకు వచ్చిన వెంటనే ఏటూరునాగారం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన వేల్పుల సుధాకర్‌కు రూ. 15వేలకు అమ్మేశారు. ఈ క్రమంలో మనసు మార్చుకున్న ఆదిలక్ష్మి, జంపయ్య ఏటూరునాగారం ఇటీవల వచ్చి తమ బిడ్డను తమకు ఇచ్చేయమని సుధాకర్‌ను అడిగారు. అతడు నిరాకరించడంతో పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఈ వ్యవహారమంతా వెలుగులోకి వచ్చింది. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు జంపయ్య, ఆదిలక్ష్మితోపాటు శిశువును కొన్న సుధాకర్‌పై 103.2023యూఎస్ 81 ప్రొటెక్షన్ చిల్డ్రన్‌యాక్ట్ 2015 ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. శిశువును ఐసీడీఎస్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

మఫ్టీలో వచ్చి.. ఆకతాయిల ఆటకట్టించి..

- విద్యార్థినులను వేదిస్తున్న వారిని పట్టుకున్న వన్‌టౌన్ సీఐ కరుణాకర్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 9: విద్యార్థినులను ఆకతాయిలు వెంబడించి వేదిస్తున్నారని సమాచారం అందుకున్న కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ మఫ్టీలో వారిని శుక్రవారం పట్టుకున్నారు. ఎస్సీ వెల్ఫేర్ బాలికల వసతి గృహం, ఎస్టీ వెల్ఫేర్ వసతి గృహం సమీపంలో మఫ్టీలో తిరుగుతూ ఆరుగు రు ఆకతాయిలను పట్టుకొని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేశారు. వన్‌టౌన్ సీఐ కరుణాకర్ మఫ్టీలో సామాన్యుడిలా వచ్చి ఆకతాయిలను అదుపులో చేసేందుకు వారిని పట్టుకోవడం అభినందనీయమని స్థానిక ప్రజలు చర్చింకుంటున్నారు. ఎ-పవర్ హౌస్‌బస్తీ, బూడిదగడ్డ ఏరియాలలో సాయంత్రం కాలేజీలు విడిచి పెట్టే సమయంలో ఆకతాయిల ఆగడాలు మితిమీరడం తో ప్రత్యేక నిఘా పోలీసులు పెట్టారు. ఆకతాయిలను స్టేషన్‌కు తరలించి వారికి కౌన్సెలింగ్ ఏర్పాటు చేశారు.


ఆకతాయిని పట్టుకున్న సీఐ

రుణమాఫీ కోసం సెల్‌టవర్ ఎక్కి యువకుడి నిరసన

వైరా, ఆగస్టు 9: మండలంలోని సిరిపురం గ్రామంలో నాగకృష్ణ అనే యువకుడు తన తండ్రికి పింఛన్, తనకు రుణమాఫీ రాలేదని సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తమ గ్రామానికి వస్తున్నారనే సమాచారం మేరకు శుక్రవారం నాగకృష్ణ సెల్‌టవర్ ఎక్కి నిరసన చేపట్టాడు. వెంటనే వైరా ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్, పోలీసుసిబ్బంది అక్కడకు చేరుకొని నాగకృష్ణను బుజ్జగించారు. సిరిపురం వస్తున్న భట్టి విక్రమార్కను కల్పిస్తామని ఆయనకు తన సమస్య చెప్పుకోవాలని నాగకృష్ణకు ఎస్ఐ సర్దిచెప్పడంతో సెల్‌టవర్ దిగి వచ్చాడు. 67సంవత్సరాల వయస్సు ఉన్న తన తండ్రికి వృద్ధాప్య పింఛన్, తమకు బ్యాంకులో ఉన్న కొద్దిపాటి రుణం మాఫీ కాలేదని ఆతర్వాత భట్టి విక్రమార్కను కలిసిన నాగకృష్ణ ఏకరువు పెట్టాడు. సమస్య పరిష్కారానికి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు.


టవర్‌పై ఉన్న యువకుడు



పూజారికి చెక్కు అందించిన ఆలయ ఈవో


నరసింహాచార్యులకు చెక్కు అందిస్తున్న ఈవో

ఖమ్మంఖానాపురంహవేలి ఆగస్టు9: ఖమ్మంలోని కాల్వొడ్డు సత్యనారాయణ సమిత వారాంజనేయ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులుగా పని చేస్తు 2024 మే 31న ఉద్యో విరమణ పొందిన అర్చకులు నరసింహాచార్యులకు రిటైర్ మెంట్ గ్రాడ్యుటీ చెక్కు రూ.2లక్షలను శుక్రవారం ఆలయంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి వివి నరసింహారావు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకుడు కృష్ణమాచారి జూనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

వైరా అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


స్నానాల లక్ష్మీపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న భట్టి విక్రమార్క

వైరా, ఆగస్టు 9: వైరా ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు. తొలిసారి తన సొంత మండలమైన వైరాలో శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. రూ.122కోట్ల విలువైన అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. వైరా మునిసిపాలిటీ కార్యాలయం వద్ద అమృత్ 2.0పథకం కింద రూ.26.87కోట్లతో నిర్మించే మంచినీటి పథకాలకు శంకుస్థాపన చేశారు. ఆతర్వాత జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకుల విజ్ఞప్తి మేరకు ర్యాలీగా జూనియర్ కళాశాలకు వెళ్లి శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను ఆయన పరిశీలించారు. నూతన తరగతి భవనాల నిర్మాణానికి అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపించాలని డీఐఈవో రవిబాబును ఆదేశించారు. ఆతర్వాత రూ.42.10కోట్లతో నిర్మించే వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల ఆధునీకరణ పనులకు, రూ.37.50కోట్లతో నిర్మించనున్న వందపడకల ఆసుపత్రి నిర్మాణానికి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఆతర్వాత తమ స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి చేరుకున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆలయం వద్ద మొక్కలు నాటారు. వైరా నదిలో రూ.7.67కోట్లతో నిర్మించనున్న రక్షణ గోడలు, రూ.4.67కోట్లతో నిర్మించే చెక్‌డ్యాం, రూ.66లక్షలతో నిర్మించనున్న స్నానఘట్టాలకు, రూ.3.20కోట్లతో నిర్మించనున్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి నిర్మాణాలకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. అనంతరం వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య ఇంట్లో ఈ నిర్మాణాలపై అధికారులతో సమీక్షించారు. అలాగే నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులతో సర్వీస్ రోడ్లు, అండర్‌బ్రిడ్జిల నిర్మాణాల గురించి సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. తర్వాత తమ గ్రామస్థులతో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సిరిపురం గ్రామానికి చేరుకొని కాంగ్రెస్ నాయకుడు మట్టూరి వెంకటేశ్వరరావు మాతృమూర్తి అయిన మట్టూరి కమలమ్మను పరామర్శించారు. అలాగే కొంతకాలం కిందట మృతిచెందిన ఆయన తండ్రి మట్టూరి వీరయ్య చిత్రపటానికి భట్టి విక్రమార్క పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాను పుట్టి పెరిగిన వైరా ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, ఈ ప్రాంత రుణాన్ని తీర్చుకుంటానని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ కార్యదర్శి నూతి సత్యనారాయణ, వైరా మునిసిపల్ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, ఆయాశాఖల ఉన్నత, జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు9: ఇల్లు, వీధులు పరిశుభ్రంగా ఉంచుకుంటూ వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. శుక్రవారం ఖమ్మంనగరంలోని ఎస్‌సీఐ గోడౌన్, మున్నేరు పరివాహక ప్రాంతాల్లో కలెక్టర్ ఖమ్మం మున్సిపల్ అధికారులతో కలిసి పర్యటించారు. డెంగూ పాజిటివ్ కేసు నమోదు జరిగిన బాధిత కుటుంబం వద్దకు వెళ్లి వ్యాధికి గల కారణాలను తెలుసుకున్నారు. పరిశుభ్రత దోమల వ్యాప్తిపై స్వయంగా అవగాహన కల్పించారు. కేఎంసీ సిబ్బంది చేస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను తనిఖీ చేశారు. తడి చెత్త, పొడి చెత్త విడదీసే ప్రక్రియను పరిశీలించారు. తాగునీటి ఇబ్బందులు, శానిటేషన్ సిబ్బంది అందుబాటు, ఆశ, అంగన్వాడీ సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్ అధికారులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి, పెనుబల్లిలో నేడు విద్యుత్ కోత

నేలకొండపల్లి/పెనుబల్లి, ఆగస్టు9: మండల పరిధిలోని కొత్తకొత్తూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శని వారం ఉదయం 9గంటల నుంచి 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు నేలకొండపల్లి ఏఈ రామా రావు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. నేలకొండపల్లి, కొత్తకొత్తూరు, పాతకొత్తూరు, తిరుమలా పురం,పైనంపల్లి, బోదులబండ,రామచంద్రాపురం, అనంత నగర్, కోరట్లగూడెంలోవిద్యుత్‌కోత ఉంటుందన్నారు.

పెనుబల్లి: తుమ్మలపల్లి విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవితేజ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని తుమ్మలపల్లి, పాత కుప్పెనకుంట్ల, కొత్త కుప్పెనకుంట్ల, బయ్యన్నగూడెం, సీతారాంపురం గ్రామాలకు ఉదయం 9నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

హార్వెస్ట్ పాఠశాలలో విద్యార్థి ఎన్నికలు


ఎన్నికల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి

ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు9: నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థి ఎన్నికలును నిర్వహిం చారు. ఈకార్యక్రమానికి విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి హాజరయ్యారు. ఆరు నుంచి పదోతరగతి విద్యార్థులు ఈ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంతో పోలింగ్ నిర్వహించామన్నారు. పోలింగ్ సరళిపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం నిర్వహించా మన్నారు. విద్యార్థి దశనుంచే నాయకుడి లక్షణాలు అలవర్చుకు నేందుకు ఈఎన్నికలు ఉపయోగపడుతాయని తెలిపారు.

డయల్ 100కు 2531కాల్స్

ఖమ్మంక్రైం, ఆగస్టు9: డయల్ 100కు జులైనెలలో 2531 కాల్స్ వచ్చాయని, వాటిపై విచారణ జరిపి 78 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశామని పోలీసుకమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో మహిళలపై వేధింపులు3, దొంగతనాలు3, సాధారణ ఘాతాలు 36, యాక్సిడెంట్లు8, అనుమానస్పద మరణాలు 4, ఇతర కేసులు 24అని సీపీ తెలిపారు. కొంతమంది డయల్100పై అవగాహన లేక ఫేక్‌కాల్స్ చేస్తున్నారని అలా చేయవద్దని అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే చేయాలని సునీల్‌దత్ ఆ ప్రకటనలో సూచించారు.

విద్యుత్‌శాఖ.. పొలంబాట

ఎర్రుపాలెం,ఆగస్టు9: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం శుక్రవారం నిర్వహంచారు. రైతులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా అప్రమత్తం చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. మధిర సబ్‌డివిజన్ ఏడీఈ ఎం.అనురాధ మాట్లాడుతూ మోటార్లకు కేపాసిటర్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని, ట్రాన్సు ఫార్మర్లు ఓవర్‌లోడ్‌తో పేలిపోకుండా జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మామునూరు సెక్షన్ ఏఈ ఆర్.శ్రీనివాసరావు, వై.రాజేష్, జేఎల్‌ఎం పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం


సత్తుపల్లిలో కొమరం భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న దయానంద్

సత్తుపల్లి, ఆగస్టు9: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం శుక్రవారం సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కొమరం భీమ్ విగ్రహం వద్ద ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా గంగారంలోని 15వ ప్రత్యేక గిరిజన పోలీస్ బెటాలియన్‌లో వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టా దయానంద్ హాజరవ్వగా బెటాలియన్ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి డప్పువాయిద్యాల నడుమ కొమ్ము నృత్యాలు చేశారు. శివాలయంలో ప్రత్యేక పూజల అనంతరం ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. గంగారం గట్టుబజార్ వద్ద జెండా ఆవిష్కరించి కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. ప్రభుత్వం ఆదివాసీ గిరిజనులకు అండగా ఉంటుందని తెలిపారు.

మధిరరూరల్: మధిర మండలం వెంకటాపురం గ్రామంలో శుక్రవారం హ్యూమన్‌రైట్స్, మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట వెంకట్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ తిరుపతిరావు, గ్రామపెద్దలు పుతుంబాక శ్రీనివాసరావు, ధరావత్ వేణు పాల్గొన్నారు.

పెనుబల్లి: ఆదివాసీ హక్కుల సాధన కోసం అలుపెరగని పోరాటయోధుడు కొమరంభీమ్ అని కాంగ్రెస్ జిల్లా నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండలం కార్యాలయం ఎదుట ఉన్న కొమరంభీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకుడు బెల్లం సురేష్ , బద్దం తిరుపతిరావు, కుంజా నాగేంద్రబాబు, కాకా వెంకటేశ్వర్లు, బద్దం శివ, కొర్సా బుచ్చాలు, కొర్సా గంగాధర్, కాసాని రుద్రజారాణి, ఎంపీడీవో అన్నపూర్ణ, తహసీల్దార్ గంటా ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు చీకటి రామారావు, బొర్రా కోటేశ్వరరావు, వంగా దామోదర్‌రావు, గోగినేని రమేష్, చెన్నారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

తల్లాడ: హైదరాబాద్ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం పొందిన గిరిజన విద్యార్థులను శుక్రవారం లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్ నాయక్ సన్మానించారు. ప్రపంచ ఆదివాసీ గిరిజన హక్కుల దినోత్సవం సందర్భంగా తల్లాడ మండలం రంగంబంజర గ్రామంలో లంబాడ హక్కుల పోరాట సమితి తల్లాడ మండల అధ్యక్షుడు భుక్యా రవి నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గుగులోత్ కృష్ణనాయక్, బాణోత్ నందూనాయక్, సైదా నాయక్, నాగేశ్వరరావు, శిల్ప, సింధులు పాల్గొన్నారు.

పాలేరులో విద్యుదుత్పత్తి ప్రారంభం


విద్యుదుత్పత్తి ప్రారంభిస్తున్న జెన్‌కో ఎస్‌ఈ

కూసుమంచి,ఆగస్టు 9: పాలేరు జలవిద్యుత్ కేంద్రంలో అధికారులు విద్యుదుత్పత్తి ప్రారంభించారు. జెన్‌కో ఎస్‌ఈ దేశ్యానాయక్ స్విచ్చాన్ చేసి ప్రారంభించారు. ప్రాజెక్టులో రెండు యూనిట్లు ఉండగా, ప్రస్తుతం ఒక యూనిట్ ద్వారా ఒక మెగావాట్ విద్యుతుత్పత్తి చేస్తున్నారు. మరో యూనిట్ మరమ్మతులకు గురికాగా నెలరోజుల్లో సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు. గత ఏడాది కేవలం 30 రోజులు మాత్రమే విద్యుదుత్పత్తి జరిగింది. ఈఏడాది ప్రా జెక్టుల్లో నీరు చేరినందున పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జెన్‌కో ఏడిఈ అఖిల్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు ప్రారంభం


జ్యోతిప్రజ్వల నిర్వహిస్తున్న నెలనెల వెన్నెల నిర్వాహకులు

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 9: నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం నెలనెల వెన్నెల ఏడోవార్షికోత్సవాన్ని కన్నులపండువగా ప్రారంభించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభించారు. కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు వివి అప్పారావు, అధ్యక్షుడు నాగబత్తిని రవి, నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్య కుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు, సీనియర్ కళాకారులు పుతుంబాక కృష్ణప్రసాద్‌బాబు, వేల్పుల విజేతలు జ్యోతిప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మిత్ర గ్రూప్ అధినేత కురివెళ్ల ప్రవీణ్ హాజరయ్యారు. అనంతరం వీవీ అప్పారావుకు స్తంభాద్రి అవార్డును ప్రదానం చేశారు. మొదటి రోజు కళాకారులు నిర్వహించిన మూల్యం నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ కర్నాటి కృష్ణ, కట్ట కృష్ణార్జున్‌రావు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి శ్రావణ శుక్రవారం పూజలు


ఖమ్మం గుంటుమల్లేశ్వర ఆలయంలో..

మధిర, ఆగస్టు 9: శ్రావణమాసం సందర్భంగా మధిరలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి శుక్రవారం కావడంతో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులతో అమ్మవారి ఆలయం కిక్కిరిసి రద్దీగా కనిపించింది. భక్తులకు తగిన ఏర్పాట్లు ఆలయ కమిటీ చైర్మన్ కపిలవాయి జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు చేశారు.

ఖమ్మంఖానాపురంహవేలి: శ్రావణమాసం మొదటి శుక్రవారం కావటంతో ఖమ్మంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మమవారు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

మహిళలపై కోతుల దాడి


గాయపడిన రంగనాయకమ్మ

తల్లాడ, ఆగస్టు9: మహిళలపై కోతులు మూకుమ్మడి దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన శుక్రవారం తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. అన్నారుగూడెం గ్రామానికి చెందిన సోదా రంగనాయకమ్మ, రమణ, తోట భద్రమ్మ, కృష్ణకుమారి, నాగమణి, బట్టు మాధవి, బాగుల నర్సమ్మ ఆరు బయట నీరు పడుతుండగా కోతుల గుంపు ఒక్కసారిగా దాడి చేసింది. ఈ దాడిలో రంగనాయకమ్మకు తీవ్రగాయాలు కాగా, మిగిలిన వారు గాయపడ్డారు. రంగనాయకమ్మను ఆసుపత్రికి తరలించారు. అన్నారుగూడెంలో కోతుల బెడద అధికంగా ఉందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కోతులను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్‌బీ ఏసీపీ సాంబరాజు

ఖమ్మంక్రైం,ఆగస్టు9: ఖమ్మం స్పెషల్ బ్రాంచి ఏసీపీగా యు.సాంబరాజు నియమితుల య్యారు. ఈమేరకు శుక్రవారం స్పెషల్ బ్రాంచి కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. సీసీఆర్‌బీ ఏసీపీగా ఉన్న సాంబరాజు ఎస్‌బీ ఏసీపీగా నియమితులయ్యారు.

డ్రగ్స్ వినియోగిస్తున్న యువకుడి అరెస్ట్

ఖమ్మంక్రైం, ఆగస్టు9: నగరానికి చెందిన ఓ యువకుడు డ్రగ్స్ వినియోగిస్తున్నాడని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసినట్టు తెలిసింది. నగరానికి చెందిన ఓ యువకుడు హెరాయిన్ వినియోగిస్తున్నాడని సమాచారంతో వరంగల్ నార్కోటిక్ పోలీస్‌లు నగరంలో పలు ప్రాంతాల్లో కొద్దిరోజులుగా విచారణ నిర్వహించినట్టు కూడా తెలిసింది. ఈనేపథ్యంలో సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి 2.5గ్రాముల హెరాయిన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.

జాబ్‌మేళాకు 15 మంది ఎంపిక

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు9: నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నయబజార్‌లో శుక్రవారం హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 15 మంది ఎంపికైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె రవిబాబు తెలిపారు. మొత్తం 100 మంది ఇంటర్ విద్యార్థులు హాజరుకాగా 15 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారికి డిగ్రీతోపాటు రెండేళ్ల శిక్షణ అందిస్తారు. ఈ సమయంలో వారికి ఉపకార వేతనం అందిస్తారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ కెఎస్ రామారావు, గోవిందరావు, కంపెని ప్రతినిధులు అంకిత, రమేష్ పాల్గొన్నారు.

ఆటోలు చోరీ: నిందితుడి అరెస్ట్

ఖమ్మంక్రైం,ఆగస్టు 9: పార్కు చేసిన ఆటోలను చోరీచేస్తున్న నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. పాతబస్టాండ్ వెనుకవైపు ఎంట్రీగేట్ వద్ద ఒక అప్పే ఆటోతో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని వారు అదుపులోకి తీసుకొని విచారణ జరిపారు. ఖమ్మంరూరల్ మండలం గుదిమళ్లకు చెందిన గోసుల వెంకన్నగా గుర్తించామన్నారు. గతంలో సూర్యాపేటలో ఆటో దొంగతనం కేసులో జైలుశిక్ష అనుభవించిన వెంకన్న, ఈనెల 6న ఖమ్మంలో రెండు ఆటోలు చోరీలు చేశాడన్నారు. శుక్రవారం నిందితుడి నుంచి రెండు ఆటోలు స్వాధీనం చేసుకొని, అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

కుర్చీలు, పారిశుధ్య సామగ్రి వితరణ



కల్లూరు, ఆగస్టు 9: మండలంలోని పేరువంచ గ్రామంలో శుక్రవారం గ్రామ పంచాయితీ కార్యాలయానికి దాతలు రూ.10వేల విలువ గల కుర్చీలు, పారిశుధ్య సామగ్రిని అందజేశారు. స్థానికంగా కీసర సాయి అన్వేష్‌రెడ్డి జ్ఞాపకార్థంగా వారి కుటుంబం తరుపున తండ్రి కీసర రవీందర్‌రెడ్డి పంచాయితీ కార్యదర్శి రాజుకు అందజేశారు. ఈ క్యాక్రమంలో కాంగ్రెస్ నాయకులు కీసర మధుసుధన్‌రెడ్డి, కీసర శ్రీనువాసరెడ్డి, ఎలమరెడ్డి రంగారెడ్డి, పగడాల నరేష్, ఎం నాగేశ్వరరావు, గాదే కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో తాజా మాజీ సర్పంచ్ కన్నుమూత



మధిరరూరల్, ఆగస్టు9: మధిర మండలం అల్లీనగరం తాజా మాజీ సర్పంచ్ గోసు చిన్నయాలాద్రి (88) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందారు. యాలాద్రి మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం వేర్వేరుగా సందర్శించి నివాళులర్పించారు. సర్పంచ్‌గా ఆయన సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రగాఢసానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా, మండల నాయకులు తోట రామాంజనేయులు, బెజవాడ రవిబాబు, వూట్ల కొండల రావు, పెరుమాళ్లపల్లి ప్రకాశరావు, పంగా శేషగిరిరావు, అన్నవరపు సత్యనారాయణ, వేల్పుల కొండ, మీనుగు గాంధీ, రేగండ్ల నర్సింహారావు, మాజీ సర్పంచ్ బాబూరావు కూడా సందర్శించి నివాళులర్పించారు.

24న అమెరికాలో మాన్వి నృత్య ప్రదర్శన



ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు9: ఖమ్మం నగరానికి చెందిన మాన్వి ఈనెల24న అమెరికాలోని టెక్సాస్‌లో నృత్యప్రదర్శనలో పాల్గొంటుందని తల్లితండ్రులు డాక్టర్ జి వెంకటేశ్వరరావు (మమత డెంటల్ కాలేజ్ డీన్, ప్రిన్సిపాల్) తల్లి డాక్టర్ జి. అనిత తెలిపారు. ఖమ్మంలోని శ్రీరాం హిల్స్‌లో ఉంటూ నాలుగేళ్ల వయస్సు నుంచే లక్ష్మీనారాయణ గురువు వద్ద కూచిపూడి నృత్యాన్ని అభ్యసిస్తుంది. తన నాట్య కళతో భారతదేశంలోని పలు రాష్ట్రాలలో ప్రదర్శిస్తూ నృత్య దీపం, అయోధ్య, వందేమాతరం, నాట్యరాని, ఆదియోగి, నాట్యతరంగిణి, నర్తన బాల లాంటి ఎన్నో పురస్కారాలను అందుకుంది. 2023 డిసెంబర్ 24న భారత ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ పోటీలతో పాటు గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ నిర్వహించిన సృజనోత్సవం పోటీలలో పాల్గొంది.

సూర్యప్రకాశ్‌రావు కుటుంబానికి సండ్ర పరామర్శ

చింతకాని, ఆగస్టు 9: మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామ మాజీ సర్పంచ్, చింతకాని సొసైటీ మాజీ చైర్మన్ కొలేటి సూర్యప్రకాశ్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం పరామర్శించారు.

ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

మధిరటౌన్, ఆగస్టు9: యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, దుంపా వెంకటేశ్వర రెడ్డి, కౌన్సిలర్లు మల్లాది వాసు, కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు మాజీ సర్పంచ్‌లు చిట్టిబాబు, మధార్, హరిబాబు, కర్నాటి రామారావు నాయకులు పాల్గొన్నారు.

కొణిజర్ల పాఠశాలను సందర్శించిన డీఈవో

కొణిజర్ల,ఆగస్టు9: మండలకేంద్రమైన కొణిజర్ల ఉన్నత పాఠశాలను శుక్రవారం ఖమ్మం డీఈవో సోమశేఖరశర్మ సందర్శించారు. పాఠశాలలోని వసతులను పరిశీలించి విద్యార్థుల బోధనతీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్యాంసన్, మండల నోడల్ అధికారి అబ్రహం, పాఠశాల హెచ్‌ఎం శాంతకుమారి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

ఖమ్మంరూరల్,ఆగస్టు9:వయనాడ్ బాధితులకోసం సీపీఎం ఆధ్వర్యంలో వరంగల్‌క్రాస్ రోడ్డులో శుక్రవారం విరాళాల సేకరణ చేపట్టారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నండ్రాప్రసాద్ సంగయ్య, ఉపేందర్, తాటి వెంకటేశ్వర్లు, రంజాన్, ప్రసాద్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా క్విట్ ఇండియాడే

ఖమ్మంరూరల్,ఆగస్టు 9:దేశవ్యాప్తంగా జాతీయ, రాష్ట్రీయ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం క్విట్ ఇండియా దినోత్సవం నిర్వహించారు. గుర్రాలపాడు, ఆరెంపుల, బారుగూడెం, పెద్దతండా, పొన్నేకల్లు, గ్రామాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.మోహన్‌రావు, నాగరాజు, ప్రభాకర్, వెంకన్న, ధర్మేందర్, వీరబాబు పాల్గొన్నారు.

తల్లాడ: కేంద్రం బడ్జెట్ పత్రాలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా నాయకుడు షేక్ లాల్‌మియా కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు నాగేశ్వరరావు, ఆనందరావు, కిషోర్, ఉపేందర్, పుల్లారావు, అనిల్, రాఘవ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు ఇవ్వాలి

తల్లాడ, ఆగస్టు9: ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు వెంటనే ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ కోరారు. శుక్రవారం తల్లాడలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు రేషన్ కార్డులు, ఇళ్లు ఇవ్వకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి ఓర్సు రమేష్, నాయకులు తమ్మారపు వెంకటేశ్వర్లు, దయాకర్‌రావు, షేక్.రంజాన్‌బీ, శివ పాల్గొన్నారు.

ధరణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

తల్లాడ,ఆగస్టు9:ధరణిపెండింగ్ భూసమస్యలను సత్వరమే పరిష్కరించాలని కల్లూరు ఆర్‌డీవో రాజేందర్ ఆదేశించారు. శుక్రవారం తల్లాడ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. పెండింగ్ దరఖాస్తులను తహసీల్దార్ వీ.రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక కారణాలతో 32దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆర్డీఓకు వివరించారు.

మునిసిపల్ కార్మికులకు దుస్తుల వితరణ

మధిరటౌన్,ఆగస్టు9: మధిర మునిసిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పీవీఆర్ ఫౌండేషన్ చైర్మన్ పారుపల్లి వెంకటేశ్వరరావు దుస్తులను వితరణ చేశారు. శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ మొండితోక లత చేతుల మీదగా వీటిని అందచేసారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ షఫీఉల్లా, మేనేజర్ ఉదయ్‌కుమార్, ఏఈ నరేష్‌రెడ్డి, టీపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చర్చిని ప్రారంభించిన మంత్రి పొంగులేటి

ఖమ్మంరూరల్, ఆగస్టు9: మండల పరిధిలోని పెద్దతండా పంచాయతీలోని టీఎన్జీఓస్ కాలనీలో చర్చిని శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ నాయకులు బండి జగదీష్ టీఎన్జీవోస్ నాయకులు పాల్గొన్నారు.